## క్లుప్తంగా

### జగన్‌ను కలిసిన ద్వారంపూడి



వైఎస్ జగన్‌తో మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

**బోట్‌క్లబ్:** మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని ఆలయ నివాసంలో కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో తాజా పరిస్థితులను ద్వారంపూడిని అడిగి తెలుసుకున్నారు.

### రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**బోట్‌క్లబ్:** ప్రతాప్‌నగర్ విద్యుత్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వైర్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించేందుకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ కాకినాడ ఈఈ ఎస్ ఉదయభాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొవ్వాడ ఫీడర్ పరిధిలోని స్వామినగర్, రామారెడ్డినగర్, చిన్నస్వామినగర్, ఇంద్రపాలెంలో పరిధిలోని శివాలయం, లిటిల్‌బడ్స్ స్కూల్ ఏరియా, చైతన్యనగర్, చీడిగ పరిధిలోని పిల్లల కాలువ, పీఆర్‌సీజీ కాలనీ, రెవెన్యూకాలనీ, ఆదర్శ్‌నగర్, బీసీ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

**జగన్నాథపురం సబ్ స్టేషన్ పరిధిలో..**

**కాకినాడ సిటీ:** వార్షిక మరమ్మతుల కోసం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జగన్నాథపురం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఇండస్ట్రియల్ అరట్లకట్ట ఫీడర్‌కు చెందిన ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. అరట్లకట్ట ఫీడర్ పరిధిలో గోపీకృష్ణ కాలనీ, శివకృష్ణ కాలనీ, ఈశ్వర్‌నగర్, హోప్ ఐలాండ్ కాలనీ, సత్యదుర్గనగర్, ఏబీఆర్ కాలనీ, ఏబీఆర్ పంప్‌హౌస్, యానాం రోడ్డు, ఏఎస్ఆర్ కాలనీ, పగడాలపేట, మిలటరీ కాలనీ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అదే విధంగా 33/11 అన్నమ్మఘాటీ సబ్ స్టేషన్ 11 కేవీ తూరంగి ఫీడర్ పరిధిలో రవీంద్రనగర్, గాయత్రీ స్కూల్ రోడ్, సూర్యనగర్, కోటిపల్లి రోడ్, వెలమల తూరంగి, ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. అన్నమ్మఘాటీ సబ్ స్టేషన్ 11 కేవీ వాటర్ వర్క్స్ ఫీడర్ పరిధిలోని కొవ్వూరు రోడ్డు, కొవ్వూరు, డి-మార్ట్, శుభం కౌంటీ, గ్యాస్ గోడౌన్ రోడ్, అరట్లకట్ట పంప్ హౌస్ ఏరియాల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

### యంగ్‌మైండ్ సంస్థకు విరాళం

**బాలాజీచెరువు:** విద్యా, ఉపాధి, యువతకు నైపుణ్య శిక్షణకు కృషి చేస్తున్న యంగ్‌మైండ్ స్వచ్ఛంద సంస్థకు సమగ్రశిక్షా సీఎంఓ చామంతి నాగేశ్వరరావు విరాళం అందజేశారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం సరస్వతి యంగ్‌మైండ్ డొనేషన్‌లో భాగంగా రూ.9,999లను సంస్థ అధ్యక్షుడు వాకడ వెంకటరమణ(చిన్నా)కు బుధవారం అందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావును సంస్థ సభ్యులతో పాటు, సమగ్రశిక్షా ఉద్యోగులు అభినందించారు.

### తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలి



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ

**కరప:** గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించేటప్పుడు తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి, ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రానికి తరలించాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు ఆదేశించారు. మండలంలోని పెద్దాపురప్పాడు, కొంగోడు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. పంచాయతీ కార్యదర్శులకు పారిశుద్ధ్య నిర్వహణపై పలు సూచనలు చేశారు. ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించి, వీధులను పరిశుభ్రంగా ఉంచాలని, డ్రెయిన్లలో పూడిక తీయించాలని, దోమల నివారణ మందును పిచికారీ చేయించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో కలిసి, పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికీ వచ్చినప్పుడు తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలన్నారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ వద్ద వర్మీ కంపోస్ట్ తయారీ, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శులు పి.వీరభద్రరావు, జి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సినిమాలు

| | |
|---|---|
| ఆనంద్ సినిమాస్ | : కుబేర, 8 వసంతాలు, హౌ టు ట్రైన్ యువర్ డ్రాగన్, శుభం |
| దేవీ మల్టీప్లెక్స్ | : 8 వసంతాలు, భైరవం, భగ్ లైఫ్, అందాల రాక్షసి |
| లక్ష్మి | : కుబేర |
| సత్యగౌరి | : సితారే జమీన్ పర్ |
| తిరుమల | : కుబేర |
| సీఅండ్‌సీ | : హౌ టు ట్రైన్ యువర్ డ్రాగన్ |
| సీఅండ్‌సీ-2 | : కుబేర |
| శ్రీప్రియ | : 8 వసంతాలు |
| పద్మప్రియ | : కుబేర |

# వాన కురిసె.. నేల మెరిసె..

- మునురుతో చల్లబడిన వాతావరణం
- ఖరీఫ్ పనుల్లో నిమగ్నమైన రైతులు
- స్తంభించిన జన జీవనం



కరప పోలీసు స్టేషన్ ఎదురుగా రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



కరపలో కురుస్తున్న వర్షం



వేములవాడ సమీపంలో నారుమళ్ల పనిలో నిమగ్నమైన రైతులు

**కరప:** ఎండధాటికి విలవిల్లాడిన ప్రజానీకానికి వాన రాకతో ఉపశమనం లభించింది. జోరుగా కురిసిన వర్షాలకు పుడమి తల్లి పులకించి.. కొత్త రూపులో మెరిసింది. మండలంలోని పలు గ్రామాల్లో మంగళ, బుధవారాల్లో ఉరుములు, మెరుపులతో చిరు జల్లులు, వర్షం పడటంతో జనజీవనం స్తంభించింది. రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. వేసవితాపానికి అల్లాడిన ప్రజలకు రెండు రోజులుగా పడుతున్న వర్షాలకు వాతావరణం కూల్‌కూల్‌గా మారడంతో ప్రజలు ఉపశమనం పొందారు. ఎండల నుంచి వరుణుడు కరుణించాడంటూ వృద్ధులు ఆనందం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి ఆకాశంలో దట్టమైన మబ్బులు కమ్మి, పగలే చీకటిమయమైంది. చల్లటి గాలులు వీచాయి. ఆ తర్వాత చిరుజల్లులు పడగా, కొన్ని గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షానికి రోడ్లపైనే నీరు నిలబడిపోవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇక్కట్లకు గురయ్యారు. కాకినాడ వెళ్లే జట్టు పనివారు, భవన నిర్మాణ కార్మికులు ఇళ్లకే పరిమితమయ్యారు. వేసవిలో వ్యవసాయ భూముల్లో మెరక, పల్లాలు తీసుకునే పనులు ముమ్మరంగా చేస్తున్నామని, రెండు రోజుల వర్షం వల్ల పనులకు ఆటంకం ఏర్పడిందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది ముందస్తు సార్వా సాగు చేపట్టాలని కాలువలకు ఈ నెల ఒకతో తేదీనే నీరు వదిలారు. పంట, మురుగు కాలువల్లో గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత పనులు ఆలస్యంగా ప్రారంభించడంతో ఖరీఫ్ పనులు ముందుకు సాగలేదు. రెండు రోజుల క్రితం నుంచి పంట కాలువలకు నీరందడం, మంగళ, బుధవారాలు వర్షం పడటంతో రైతులు ఖరీఫ్ నారుమళ్లు వేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. నారుమళ్ల దుక్కుకు వర్షం సహకరిస్తుందని రైతులు అంటున్నారు.

### ఈదురు గాలులు.. హోరున వర్షం



టూటౌన్ నూకాలమ్మ గుడి రహదారిలో వర్షపు నీటితో ప్రజల అవస్థలు



మెయిన్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

**బోట్‌క్లబ్:** కాకినాడ నగరంలో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకూ ఈదురు గాలులతో జోరుగా వర్షం కురిసింది. ఉదయం మూడున్నర గంటల పైనే హోరున వర్షం కురవడంతో నగరంలో పలు ప్రాంతాలలో వర్షపు నీరు రోడ్లపైకి చేరింది. సాయంత్రం సుమారు రెండు గంటలకు పైగా వర్షం పడడంతో నగరంలో చాలా రహదారులు నీటమునిగాయి. దీంతో సాధారణ ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. స్థానిక వైఎస్సార్ బ్రిడ్జి కింద వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. చిన్న మార్కెట్‌కు వెళ్లేందుకు ప్రజలు అవస్థలు పడాల్సి వచ్చింది. స్థానిక మెయిన్ రోడ్డులో వర్షపు నీరు రోడ్డుకు ఇరువైపులా నిలిచిపోవడంతో షాపులకు వెళ్లేందుకు వినియోగదారులు అవస్థలు పడ్డారు. చిన్నపాటి వర్షాలకు నగరంలో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోతుండడంతో ప్రజల బాధలు వర్ణణాతీతం. సాయంత్రం నాలుగు గంటల నుంచి వర్షం జోరుగా పడడంతో స్కూళ్ల నుంచి ఇళ్లకు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. సైకిల్‌పై, కాలినడకన వెళ్లే విద్యార్థుల బాధలు వర్ణణాతీతం. ఇక చిరు వ్యాపారులు వర్షం కారణంగా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఉదయం నుంచి వర్షం కురవడంతో రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునే వీధి వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. కొనేవారు లేకపోవడంతో ఉసూరుమంటూ ఇళ్లకు తిరుగు పయనమయ్యారు.

### రేపు మండల పరిషత్ సమావేశం

**కరప:** వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించేందుకు స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఎం.అనుపమ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశానికి ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షత వహిస్తారన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

### లోక్ అదాలత్‌పై అవగాహన

**కాకినాడ రూరల్:** కోర్టు వివాదాల సత్వర పరిష్కారానికి వేదిక లోక్ అదాలత్ అని, కక్షిదారులు దీనిని సద్వినియోగం చేసుకుంటే శ్రేయస్కరమని న్యాయవాది యనమల రామం అన్నారు. బోట్‌క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంతాలు పట్టింపులకు పోయి కేసులు పెట్టుకుని, ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని చెప్పారు. వారు రాజీమార్గంలో లోక్ అదాలత్ ద్వారా లబ్ధి పొందవచ్చన్నారు.

### నేడు మాదకద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ

**కాకినాడ రూరల్:** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో గురువారం మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ నిర్వహిస్తున్నారు. సాయంత్రం 4.30 గంటలకు జిల్లా పోలీసు కార్యాలయం నుంచి భానుగుడి సెంటర్ వరకు ర్యాలీ కొనసాగుతుందని ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మోకా పవన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## జెడ్పీ బంగ్లాలో బ్లైండ్ హోం ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

**కాకినాడ సిటీ:** అతి ముఖ్యమైన ప్రాంతంలో బ్లైండ్ హోమ్ ఏర్పాటు చేయడం ద్వారా వారికి ఏ అవసరం ఉన్నా పది నిమిషాల్లో సాయం చేసేందుకు అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. స్థానిక కర్ణంగారి జంక్షన్ సమీపంలో ఆధునీకరించిన జెడ్పీ సీఈవో భవనాన్ని బ్లైండ్ హోమ్‌కు కేటాయించారు. బుధవారం దీనిని ప్రారంభించిన సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మంచి ప్రదేశంలో బ్లైండ్ హోమ్‌కు భవనాన్ని కేటాయించిన జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, జెడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావును అభినందించారు. ఈ బిల్డింగ్‌ను ఆధునీకరించడానికి ఆర్థిక సాయం చేసిన మాజీ ఐఏఎస్ అధికారి చల్లా భీమేశ్వరరావు సతీమణి నిర్మలమ్మకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 1958 బ్యాచ్‌కి చెందిన ఐఏఎస్ అధికారి చల్లా భీమేశ్వరరావు ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎన్నో చేశారని కొనియాడారు. ఈ బ్లైండ్ హోమ్‌కు సీఎస్సార్ నిధులతో కోరమండల్ ఫెర్టిలైజర్స్ మంచాలు, బెడ్లు, దిండ్లు, ట్రంకు పెట్టెలు (బాక్సులు) సమకూర్చారని కృతజ్ఞతలు తెలిపారు. ఈ భవనంలో ఐదు ఏసీల అవసరం ఉందని, వాటిని కూడా కోరమండల్ ఫెర్టిలైజర్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. భవనంలో 47 మంది ఉంటారని, వారికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తారని తెలిపారు. మాజీ ఐఏఎస్ అధికారి చల్లా భీమేశ్వరరావు మాట్లాడుతూ, విజువల్ ఇంపెడ్‌కు ఈ భవనాన్ని ఆధునీకరించి ఇచ్చే అవకాశం కల్పించినందుకు కలెక్టర్ షణ్మోహన్‌కు ధన్యవాదాలు తెలిపారు. తన మనశ్శాంతి కోసం ఈ కార్యక్రమం చేశానన్నారు. కార్యక్రమానికి వచ్చిన అంధుల కష్టసుఖాలను తెలుసుకున్నారు. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు మాట్లాడుతూ, అంధులకు ఈ భవనం కేటాయించాలని సంకల్పించిన కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కాకినాడ నగరానికి మధ్యలో ఈ భవనం ఉందని, అన్నింటికీ అనుకూలమైన ప్రాంతమన్నారు. రానున్న రోజుల్లో ఈ భవనాన్ని ఇంకా అభివృద్ధి చేసి, మరిన్ని సౌకర్యాలు కల్పిస్తారని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, డీఆర్వో జె.వెంకటరావు, రెడ్‌క్రాస్ సంస్థ రాష్ట్ర సెక్రటరీ వైడీ రామారావు, జెడ్పీ డిప్యూటీ సీఈవో జీఎస్ రామ్‌గోపాల్, కోరమండల్ ఫెర్టిలైజర్స్ సీఎస్సార్ సీనియర్ మేనేజర్ పి.వంశీకృష్ణ, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ వై.శ్రీనివాసులు, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డి.రామసుబ్రహ్మణ్యం, ఉమా ఎడ్యుకేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు చౌక సరకుల డోర్ డెలివరీ

- రేషన్ డీలర్లకు జేసీ మీనా ఆదేశం



డీలర్లు, డిప్యూటీ తహసీల్దార్లతో మాట్లాడుతున్న జేసీ రాహుల్ మీనా

**కాకినాడ సిటీ:** జిల్లాలో చౌక దుకాణాల డీలర్లు గురువారం నుంచే వృద్ధులు, వికలాంగులు, మంచం నుంచి కదల్లేని కార్డుదారులందరికీ డోర్ డెలివరీ ప్రారంభించాలని జేసీ రాహుల్ మీనా ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లాలోని చౌక దుకాణాల డీలర్లు, పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు, అసిస్టెంట్ సప్లై ఆఫీసర్, జిల్లాలో పౌర సరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. డోర్ డెలివరీ సక్రమంగా అమలయ్యేలా అధికారులకు ఆదేశించినట్టు తెలిపారు. ఈ-కేవైసీ పెండింగ్ ఉన్న కార్డుదారుల కుటుంబ సభ్యులందరూ త్వరితగతిన ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని, ఇందుకు డీలర్లు చొరవ తీసుకోవాలని ఆదేశించారు.

## రోడ్డు ఆక్రమణపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు



కరప నీలయ్యతోట వీధిలో రోడ్డు ఆక్రమణపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

**కరప:** పంచాయతీ పరిధిలోని నీలయ్యతోట వీధిలో రోడ్డు ఆక్రమణకు గురైందని, ఆక్రమణలు తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టరేట్‌లోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్)లో ఫిర్యాదు ఇచ్చినట్టు ఆ ప్రాంతవాసులు కాలనాథభట్ల సుబ్రహ్మణ్యం, పేకేటి ఏడుకొండలు, నున్న సుబ్బయ్య, గాదావర్ఖ్యుల కొండయ్య, కళిలింక రాజా తదితరులు 13 మంది మంగళవారం తెలిపారు. ఆ రోడ్డు ఒకచోట 19 అడుగులు ఉంటే, కొంత దూరవ వెళ్లే సరికి 12 అడుగులే ఉందని చెప్పారు. దీనిపై సర్వే చేసి, న్యాయం చేయాలని కోరుతూ ఫిర్యాదు ఇచ్చినట్టు వారు తెలిపారు.

**డిప్యూటీ ఎంపీడీఓ వివరణ**

రోడ్డు ఆక్రమణపై పీజీఆర్ఎస్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావును వివరణ కోరగా, కలెక్టరేట్ నుంచి వచ్చిన ఫిర్యాదుపై పంచాయతీ కార్యదర్శి యు.నిర్మలాదేవితో కలిసి ఆ రోడ్డును పరిశీలించామని చెప్పారు. పంచాయతీ రికార్డుల్లో కానీ, రెవెన్యూ రికార్డుల్లో కానీ నీలయ్యతోట వీధికి సంబంధించి రోడ్లకు నిర్దిష్ట కొలతల రికార్డులు ఏమీ లేవన్నారు. దీంతో సర్వే చేయడానికి వీలు పడలేదని తెలిపారు. ఆ వీధిలోని ఇళ్ల యజమానులు తమ రికార్డులతో ముందుకు వస్తే సర్వేకు అవకాశం ఉంటుందన్నారు. రోడ్డును ఎవరు ఆక్రమించారో ఫిర్యాదుదారులు తమ పిటీషన్‌లో వివరించలేదన్నారు. దీంతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణం ఆగిపోయిందని, ఈ సమస్య పరిష్కారానికి కొంత సమయం పడుతుందని డిప్యూటీ ఎంపీడీఓ వివరణ ఇచ్చారు.

## పథకాలు ఇవ్వాలి.. లేకుంటే జీతాలు పెంచాలి

- మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక కుటుంబాల డిమాండ్



నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు

**బోట్‌క్లబ్:** తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ చేపట్టిన సమ్మె బుధవారం 50వ రోజుకు చేరింది. స్మార్ట్ సిటీ కార్యాలయం వద్ద కాకినాడలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు తమ కుటుంబ సభ్యులతో సహా రోడ్డుపైకి వచ్చి నిరసన తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, తమకు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల పిల్లలు మీడియాతో మాట్లాడుతూ, 50 రోజులుగా తమ తల్లిదండ్రులు జీతాలను పెంచాలని కోరుతూ సమ్మె చేస్తున్నా కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం చాలా దారుణమన్నారు. చాలీచాలని జీతాలతో తమ ఇళ్లు గడవడం లేదన్నారు. నెలకు రూ.13 వేలతో ఇంటి అవసరాలు కూడా పూర్తిగా తీరడం లేదన్నారు. తమ స్కూల్ ఫీజులు ఎవరు కడతారని వారు ప్రశ్నించారు. జీతాలు తక్కువగా ఇచ్చి, ప్రభుత్వ పథకాలు ఇవ్వకుండా చేయడం ఈ ప్రభుత్వానికి తగదన్నారు. అందరికీ ఇచ్చేలా రూ.27 వేలకు జీతం పెంచాలని కోరారు. ఆధార్ కార్డు స్టేటస్ చూడగానే తమ తల్లిదండ్రులు ప్రభుత్వ ఉద్యోగులుగా కనబడుతుందని, అందువల్ల వారిని రెగ్యులర్ ఎంప్లాయిస్‌గా పరిగణించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు శ్రీధర్ మాట్లాడుతూ, తమ సమస్యను సీఎం, డిప్యూటీ సీఎం, మున్సిపల్, విద్యా శాఖల మంత్రుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## గడువులోగా భూ సమస్యలపై చర్యలు

- ఆర్డీవో మల్లిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లిబాబు

**కాకినాడ సిటీ:** రెవెన్యూ కార్యకలాపాలపై సిబ్బంది నిర్దీత గడువులో చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఎస్ మల్లిబాబు తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం ఆయన కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇళ్ల స్థలాలకు సంబంధించి సర్వే చేయాలని, సీనియర్ సిటిజన్ కేసుల్లో ఉత్తర్వులు అమలు జరిగేటట్లు చూడాలన్నారు. రీ సర్వేకు సంబంధించి నిర్దీత గడువులో దరఖాస్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ పనుల నేపథ్యంలో కౌలు రుణ అర్హత కార్డులు మంజూరు చేయాలని చెప్పారు. వివిధ ప్రభుత్వ శాఖల భూములకు సంబంధించి ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. సూర్యఘర్ పథకానికి సంబంధించి భూములు గుర్తించాలన్నారు. అదే విధంగా ఆర్‌వోఆర్ కేసులు, నీటితీరువా వసూళ్లు, రేషన్ కార్డు దరఖాస్తులు, జాతీయ రహదారుల భూసేకరణ, అభ్యంతరాలు లేని భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి ఫ్రీ హోల్డ్ గ్రామ స్థాయిలో, మండల స్థాయిలో రెవెన్యూ రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. రీ సర్వేలో వచ్చే దరఖాస్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఈనాం ఎస్టేట్ ఎబోలిషన్ యాక్ట్ పీఓటీ రికార్డు ఆఫ్ రైట్ భూ ఆక్రమణ కేసుల్లో, వెబ్‌ల్యాండ్ తదితర రెవెన్యూ అంశాల్లో ఎప్పటికప్పుడు సమీక్షించి, నిర్దీత గడువులో చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఆదేశించారు. ఈ సమావేశంలో పరిపాలనాధికారి డీటీఏ చైనులు, తహసీల్దార్లు వి.జితేంద్ర, ఎస్ఎల్ఎస్ కుమారి, పి.త్రినాథరావు, కె.చిన్నారావు, జీఆర్ ఠాగూర్, కృష్ణ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## స్కిల్ డెవలప్‌మెంట్ ల్యాబ్‌కు చేయూత



ఇంటరాక్టివ్ ప్యానల్‌ను ప్రారంభిస్తున్న ఈడీ రత్నేష్‌కుమార్

**బోట్‌క్లబ్:** రోటరీ క్లబ్ కాకినాడ సెంట్రల్ ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ ల్యాబ్‌కు ఓఎన్‌జీసీ చేయూతనివ్వడం ఆనందంగా ఉందని ఓఎన్‌జీసీ ఈస్ట్రన్ ఆఫ్‌షోర్ ఈడీ రత్నేష్‌కుమార్ అన్నారు. స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని రోటరీ క్లబ్ కాకినాడ సెంట్రల్ స్కిల్ డెవలప్‌మెంట్ ల్యాబ్ హాల్‌లో ఓఎన్‌జీసీ 30 కంప్యూటర్లు, ఇంటరాక్టివ్ ప్యానల్ అందించారు. దీని ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రత్నేష్‌కుమార్ మాట్లాడుతూ, సామాజిక సేవా కార్యక్రమాలకు తమవంతు సాయంగా స్కిల్ డెవలప్‌మెంట్ ల్యాబ్‌కు కంప్యూటర్లు, ఫర్నిచర్, ఇంటరాక్టివ్ ప్యానల్ అందించామన్నారు. ఎంతో మంది నిరుపేదలకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా ఉచిత శిక్షణ అందిస్తున్నారన్నారు. అటువంటి సంస్థకు చేయూతనివ్వడం తమ బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా రత్నేష్‌కుమార్‌ను క్లబ్ సభ్యులు సత్కరించి, జ్ఞాపిక అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ పూర్వ గవర్నర్లు లక్కరాజు సత్యనారాయణ, వీరభద్రారెడ్డి, క్లబ్ అధ్యక్షుడు బంగారు కృష్ణమోహన్, ప్రాజెక్టు చైర్మన్ బోడా ఆనంద్, క్లబ్ సెక్రటరీ దుర్గాప్రసాద్, సీనియర్ సభ్యులు వాకచర్ల సూర్యం, వెంకటేష్, జయేష్‌దేశాయ్, జీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

## రూ.2 వేల కోట్ల డిపాజిట్ల సేకరణ లక్ష్యం

- ది కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు చైర్మన్ రవీంద్ర



వివరాలు వెల్లడిస్తున్న బ్యాంకు చైర్మన్ రవీంద్ర

**బోట్‌క్లబ్:** ఖాతాదారులకు తమ బ్యాంకు మెరుగైన సేవలను అందిస్తోందని ది కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు చైర్మన్ చిట్టూరి రవీంద్ర తెలిపారు. ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి రూ.15.64 కోట్ల నికర లాభం ఆర్జించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని కో-ఆపరేటివ్ బ్యాంకుల్లో 46 బ్రాంచీల్లో రూ.1,860 కోట్ల టర్నోవర్‌తో రెండో స్థానంలో ఉందన్నారు. స్థానిక హోటల్‌లో బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో బ్యాంక్ 46వ వార్షికాదాయం వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి రూ.1,110.40 కోట్ల డిపాజిట్లు, రూ.750.16 కోట్ల రుణాలు ఉన్నట్లు చెప్పారు. ఈ ఏడాది సభ్యులకు 12 శాతం డివిడెండ్ ఇచ్చేందుకు పాలకవర్గం ఆమోదించిందని చెప్పారు. బ్యాంకు గతంలో లాగానే ఈ ఏడాది కూడా ఏ-గ్రేడ్ సాధించి ముందంజలో ఉందన్నారు. బ్యాంకు డిపాజిట్లు రూ.వెయ్యి కోట్లు దాటడంతో టౌన్ బ్యాంకును టైర్ త్రీ స్థాయి బ్యాంకుగా రిజర్వ్ బ్యాంక్ గుర్తించిందని, ఇది విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ తర్వాత స్థానంలో ఉందన్నారు. రూ.రెండు వేల కోట్ల డిపాజిట్ల సేకరణ లక్ష్యంగా బ్యాంకు పాలకవర్గం ముందుకు సాగుతోందన్నారు. నిర్వహణలో లేని ఖాతాల సొమ్మును గతేడాది మార్చి 31 నాటికి రూ.2.54 కోట్లను రిజర్వ్ బ్యాంకు ఖాతాకు పంపించినట్లు చెప్పారు. ఒకవేళ ఎవరైనా ఖాతాదారులు తమ ఖాతా సొమ్మును వాపస్ చేయాలని కోరితే, వారి గుర్తింపును పరిశీలించి, నిర్దీత దరఖాస్తు ఆధారంగా ముందస్తుగా బ్యాంకు చెల్లింపులు చేసి, ఆ మొత్తానికి తగిన ఆధారాలతో రిజర్వ్ బ్యాంక్ నుండి క్లెయిమ్ చేసుకుంటామన్నారు. రూ.15 లక్షల వరకు బంగారు ఆభరణాలపై, అలాగే వ్యక్తిగతంగా రూ.రెండు కోట్లు, గ్రూపుగా రూ.మూడు కోట్ల రుణాలను నిబంధనలకు లోబడి ఇస్తామని వివరించారు. కాకినాడ రామారావు పేటలోని ప్రధాన కార్యాలయంలో రెండో ఫ్లోర్ నిర్మాణం జరిగిందని, అక్కడ ఖాతాదారుల సౌకర్యార్థం లాకర్ల ప్లాజా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొత్తగా పెద్దాపురం, పిఠాపురం, అనకాపల్లిల్లో టౌన్ బ్యాంక్ బ్రాంచ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో బ్యాంకు వైస్ చైర్మన్ తోట మెహర్ సీతారామ సుధీర్, డైరెక్టర్లు సత్తి రామారెడ్డి, రిమ్మలపూడి ధర్మేంద్ర, కంటిపూడి సత్యనారాయణ, అయ్యగారి వెంకటేష్, ఎండీ సుధీర్‌కుమార్, సీఈవో సి.సుగుణారావు, బోర్డు మేనేజ్‌మెంట్ సభ్యులు నల్లమిల్లి జనార్దనరెడ్డి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు గ్రామస్తుల సత్కారం



గురజనాపల్లిలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయ బృందం

**కరప:** గురజనాపల్లి పబ్బినీడి పాపారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన, కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులను గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనసూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, సుదీర్ఘకాలం పనిచేసిన ఆంగ్ల ఉపాధ్యాయుడు జి.అర్జునరావు, గణిత ఉపాధ్యాయుడు కె.శరత్ పాఠశాలకు అందించిన సేవలు మరువలేనివన్నారు. హెచ్ఎం ఎ.సాయి మోహన్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు అర్జునరావు, శరత్‌కు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు లభించడంతో తాళ్లరేవు మండలం లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలకు, జార్జిపేట ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారన్నారు. అనంతరం బదిలీ అయిన ఉపాధ్యాయులను, ఇక్కడకు బదిలీపై వచ్చిన ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎన్.ఉమామహేశ్వరరావు, హిందీ పండిట్ పి.దిల్షాద్ ఖాన్‌ను గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఎంపీటీసీ వై.వీరవేణి, ఉప సర్పంచ్ సుబ్రహ్మణ్యం, ఎస్ఎంసీ చైర్మన్ పి.నూకరాజు, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, వీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.